www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 ఆగస్టు 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ


పట్టణంలో విరాళాలు సేకరించిన అంగన్‌వాడీ వర్కర్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కేరళలో వయనాడ్ వరద బాధితులకు అండగా నిలవాలని సిఐటియు పిలుపు మేరకు పట్టణంలో అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం విరాళాలను సేకరించారు. పట్టణంలో మెయిన్ రోడ్ లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విరాళాలు సేకరించారు. రూ 8560 లు విరాళాలుగా సేకరించామని, ఈ మొత్తం రాష్ట్ర కార్యాలయం ద్వారా బాధితులకు అంద జేస్తామని జిల్లా కార్యదర్శి దుర్గమ్మ తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు వీరలక్ష్మి, విజయలక్ష్మి, శ్రీదేవి, సూర్య కుమారి, జహార్, దుర్గ, చంద్రకళ లక్ష్మీరత్నం తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు అందేనా?

- మూడు నెలలైనా అందని ధాన్యం సొమ్ములు
- రూ.కోట్లలో బకాయిలు
- అదిగో.. ఇదిగో అంటూ రైతులను మభ్యపెడుతున్న అధికారులు
- కూటమి ప్రభుత్వ తీరుపై రైతుల ఆవేదన

రబీ ధాన్యం విక్రయించిన సొమ్ము ఇవ్వకుండా గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలైనా రైతుల ధాన్యం సొమ్ము గురించి పట్టించుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం వచ్చినా ఇవ్వాల్సిన సొమ్ము మాత్రం సకాలంలో ఇవ్వరు. ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయాలి' అంటూ అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు.

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని గడిచిన కాలంలో వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట దిగుబడులు బాగానే వచ్చాయి. రైతులు ఆనందంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించారు. అక్కడ నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ము మాత్రం రైతుల ఖాతాల్లో జమకాని పరిస్థితి నెలకొంది. మండలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఏప్రిల్ 28 తర్వాత రైతుల ఖాతాల్లో సొమ్ము జమ నిలిచిపోయింది. రైతులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో కొత్త ప్రభుత్వం జులై మొదటివారంలో కొంత సొమ్ము విడుదల చేసింది. ఈ సొమ్మును మే పదో తేదీకి ముందు ధాన్యం విక్రయించిన రైతులకు మాత్రమే జమ చేశారు. పదో తేదీ తర్వాత విక్రయించిన రైతులకు సొమ్ము వేయలేదు. మే పదో తేదీ అంటే దాదాపు మూడు నెలలు గడిచిపోయింది. ధాన్యం విక్రయించిన తర్వాత మూడు నెలపాటు సొమ్ము జమ చేయకపోతే రైతులు పరిస్థితి ఏమిటనే కూడా పాలకులకు లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడిచింది.


ధాన్యం సేకరణలో రైతులు (ఫైల్)

రైతులకు సంబంధించిన ధాన్యం బకాయిలకు తొలి ప్రాధాన్యతివ్వాల్సి ఉన్నప్పటికీ సర్కారు పట్టించుకోవడం లేదనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ధాన్యం సొమ్ము కోసం రైతులు ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లి వినతులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పౌర సరఫరాల శాఖాధికారుల వద్దకు వెళ్తే అదిగో.. ఇదిగో అంటూ చెప్పడం తప్ప ధాన్యం సొమ్ము మాత్రం జమకాని పరిస్థితి నెలకొంది. మూడు నెలలు పెట్టుబడి అప్పు తెచ్చిన రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎప్పుడిచ్చిన ధాన్యం సొమ్ము మాత్రమే ఇస్తుందే తప్ప వడ్డీ చెల్లించదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపధ్యంలో ధాన్యం సొమ్ము వడ్డీతో చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కోత యంత్రాలకు, ధాన్యం కోయలకు, కూలీలకు, పెట్టుబడి తెచ్చిన అప్పుల వాళ్ల నుంచి ఒత్తిళ్లు తట్టుకోలేక రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఓవైపు ఖరీఫ్ సాగు భారీ వర్షాలు వరదలకు దెబ్బతింది. మరోవైపు రబీ ధాన్యం సొమ్ము చేతికి రాక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం సొమ్ము వడ్డీతో కలిపి వెంటనే జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పటి వరకూ చిల్లి గవ్వ జమ కాలేదు

ఆరు నెలలు పండించిన పంటను విక్రయిస్తే మూడు నెలలు గడిచినా సొమ్ము ఇవ్వలేదు. మా కుటుంబం 10 ఎకరాల వరకూ రబీలో వరి సాగు చేశాం. మే 18న ధాన్యం విక్రయించాం.రూ. ఆరులక్షల వరకూ ధాన్యం సొమ్ము రావాల్సి. ఇప్పటి వరకూ చిల్లిగవ్వకూడా జమ కాలేదు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చినా పలు రోజుల్లో జమవుతాయని చెప్పారు. ఇప్పటి వరకూ జమ కాలేదు. ధాన్యం సొమ్ము వెంటనే జమ చేయాలని కోరుతున్నాం.

-అంబటి సత్యనారాయణ , సిరిపల్లి

ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయాలి

రబీలో అయిదు ఎకరాలు సాగు చేశాను. ధాన్యం సొమ్ము రూ.రెండు లక్షల వరకు రావాల్సి ఉంది. మే రెండోవారంలో ధాన్యం విక్రయించాను. మూడు నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ములు ఇవ్వకపోతే రైతులు వ్యవసాయం ఎలా చేయాలి. ధాన్యం సొమ్ము వెంటనే జమ చేయాలని కోరుతున్నాం. ధాన్యం సొమ్ము జమకాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా కూటమిప్రభుత్వం ధాన్యం సొమ్ములు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి

-మొర్త సత్యనారాయణ, కౌలురైతు, సిరిపల్లి

రైతుల గురించి పట్టించుకునే వారే లేరు

రబీలో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. మే మూడో వారంలో 200 సారల విక్రయించాను. దాదాపు రూ.లక్షాయాభై వేల ధాన్యం సొమ్ము రావాలి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం ఇస్తే నెల 5న న పడతాయని చెప్పినా పడలేదు. రైతుల గురించి పట్టించుకునే వారే లేరు. టాక్టర్ కిరాయిలు, రబీ పెట్టుబడికి తెచ్చిన అప్పు ఇప్పటికీ తీర్చలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క వరదలకు ఖరీఫ్ నారుమడులు మునిగిపోయాయి.

- పెనుమాల సింహాచలం, అయినవిల్లి లంక

నేడు పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నిక

- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు, పాఠశాల హెచ్‌ఎంలు ఏర్పాట్లు చేయాలి


కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నిక ఆగస్టు 8 గురువారం నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌డిఒలను, డిఎస్‌పిలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలోని పాఠశాలల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 1581 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని యాజమాన్య కమిటీ సభ్యులను ఎన్ను కునేందుకు గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల జరుగుతాయన్నారు. ఎన్నికల్లో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకొని కమిటీ సభ్యులను ఎన్నుకుంటారని అన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నికైన కమిటీ సభ్యులు ఎన్నుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం, అనంతరం స్కూల్ యాజ మాన్య కమిటీల మొదటి సమావేశం నిర్వహిస్తా రన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుని ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, పంచాయతీ సెక్రటరీలు, విఆర్ఒలు అబ్జర్వర్లుగా వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ డిఇ కె.విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి రామచంద్రపురం టౌన్ సబ్‌స్టేషన్, ఓదురు ఫీడర్ అత్యవసర మరమ్మతుల చేపట్టనున్నారని ఆయన తెలిపారు. ఈ నిమిత్తం చోడవరం గ్రామం, నరసరావుపేట గ్రామం, ఓదూరు గ్రామాల్లో ఆక్వా సర్వీసెస్, నూకల మిల్లు, అమత రైస్‌మిల్లు, విఎస్ఎం కాలేజ్, లెప్రసీ కాలనీ, చింతపల్లి సూరన్న నగర్, పసలపూడి లేఔట్, ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డు కాకినాడ రోడ్డు రైస్ మిల్లు, ఎస్‌బిహెచ్ బ్యాంక్ , బ్యాంక్ ఏరియా, గుబ్బల వారి పేట, అంకం వారి వీధి స్టీల్ వేల్ పేట, మార్కెట్ సెంటర్ శివాలయం వీధి లోను విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆయన తెలిపారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని టేకి, మాచర, శ్రీరామపురం, గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఇఇ విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు వెదురుమూడి సబ్ స్టేషన్ పరిధిలోని మెయింటెనెన్స్ వర్క్, ట్రి కటింగ్ పనులు కారణంగా ఆయా గ్రామాల్లోవిద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

9న ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో

ఆలమూరు: స్థానిక 33/11కెవి సబ్ స్టేషన్ నందు మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా ఈ నెల 9న శుక్రవారం ట్రీ కట్టింగ్ చేపట్టనున్నట్లు రామచంద్రపురం ఇఇ వై.విజయానంద్ బుధవారం తెలిపారు. దీంతో ఆలమూరు, చొప్పెల్ల సబ్ స్టేషన్ల పరిధిలో గల మూలస్థానం, జొన్నాడలకు విద్యుత్ కి అంతరాయం కలుగ నుందన్నారు. సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని ప్రజలందరూ సహకరించాలన్నారు.


హోమంలో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు

భీమేశ్వరాలయంలో మంత్రి సుభాష్‌కి ఘన స్వాగతం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులకు వేద పండితులు ఘన స్వాగతం పలికారు. మూడు నెలలుగా పురా వస్తుశాఖ మరమ్మతుల నిమిత్తం ఆలయాన్ని మూసివేశారు. బుధవారం సంప్రోక్షణ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ ఇఒ పి.తారకే శ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు హాజరై ఆలయంలో నిర్వహించిన హోమం, గోపూజ, పూర్ణాహుతితో పాల్గొ న్నారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం దంపతులు పాల్గొన్నారు. అనంతరం యాత్రికులు సర్వదర్శనాలు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సిఎం ప్రకటనపై డీలర్ల హర్షం

ప్రజాశక్తి -మామిడికుదురు

ఎండియు వాహనాలను రద్దుచేసి రేషన్ డీలర్ల సంక్షేమానికి చర్యలు తీర్చుకుంటామని సిఎం చంద్రబాబు చేసిన ప్రకటనపై వారు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగరం గొడౌన్ వద్ద సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో ఉన్న ఫ్లెక్సీకి డీలర్లు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మామిడికు దురు, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించారు. **అమలాపురం:** ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఆప్కో అమలాపురం, జిల్లాలోని సహకార సంఘాల వారి సహకారంతో ఏర్పాటుచేసిన చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.. అనంతరం చేనేత కార్మికులు నేస్తున్న ఉత్పత్తులను పరిశీలించారు. ప్రభుత్వపరంగా చేనేత రంగాన్ని ఆదుకునేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.


కేక్ కట్ చేస్తున్న విలసవిల్లి గ్రామ సర్పంచ్ ఊర్మిళాదేవి

చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత సొసైటీ కార్మికులతో చేనేత ఉత్పత్తు లను ప్రోత్సహించాలని కలెక్టరేట్ నుంచి నల్ల వంతెన వరకు ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ లోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో .. చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చేనేత సొసైటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చేనేత కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో చేనేత మరి జౌళి శాఖ అభివృద్ధి అధికారి ఎం రాజు , సహాయ అభివృద్ధి అధికారి ఎ.వెంకటేశ్వరరావు, బండారులంక చేనేత సంఘం మాజీ చైర్మన్ పి వరదరాజులు, హసన్బాద చేనేత సంఘం మాజీ చైర్మన్ డి ప్రకాష్, చేనేత సంఘాల మేనేజర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం :** విలసవిల్లిలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి మాట్లాడుతూ 1905లో బ్రిటిష్ ప్రభుత్వంపై మహాత్మా గాంధీ విదేశీ వస్త్ర బహిష్కరణ కార్యక్రమానికి నాంది పలికారని దీనిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం గా ప్రకటించిందని అన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సలాది సతీష్, చేనేత సొసైటీ మాజీ అధ్యక్షులు పుత్సల ఏసు,బళ్ళ నాగ సతీష్,కోలా ఏసు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో చేనేత దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-అంబాజీపేట


సర్వసభ్య సమావేశంలోమాట్లాడుతున్న ఎంఎల్ఎ గిడ్డి

అధికారులు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో, అధికారులు సమన్వయమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం అంబాజీపేట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. గంగలకుర్రు అగ్రహారం పెదపాలెం దగ్గర పంట కాలువ గట్టు ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న మరుగుదొడ్ల నీరు కాలువలోకి వదలడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దీనికి పరిష్కారం చూపాలని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు కోరారు. ఎంఎల్ఎ సంబంధిత ఇరిగేషన్ డిఇతో మాట్లాడి సమస్యలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అల్లాడ స్వామినాయుడు కాలనీలో కొంత మంది ఇళ్ళు నిర్మించుకోగా పల్లంగా ఉండటంతో కొందరు ఇళ్లు నిర్మించుకోలేదని, ఇళ్ల పై నుంచి విద్యుత్ వైర్లు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు విద్యుత్ శాఖ తీరుపై ఆరోపించారు. ఇళ్ళు నిర్మించుకోలేని వారికి నోటీసులు ఇచ్చి వారి వివరణతో ఆస్థలాలు వేరే వారికి ఇస్తారన్నారు. అలాగే విద్యుత్ ఎఇ మాట్లాడుతూ అవకాశం ఉన్న పనులు చేపడతామని, ప్రజలకు అసౌకర్యంగా ఉన్న స్థంబాలు వైర్లు మార్పులు చేర్పులకు కొంత సమయం పడుతుంద న్నారు. డ్వాక్రాలో అవకతవకలు, యానిమేటర్ల పనితీరుపై కె.పెదపూడి, పుల్లేటికుర్రు, ఇసుకపూడి, గంగలకుర్రు, వాకలగరువు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకు వచ్చారు. అవకతవకలపై సమగ్ర సమాచారం అందజే యాలని ఎంఎల్ఎ గిడ్డి ఎపిఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరతపూడి సొసైటీ, హైస్కూల్ కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా గా ఉండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. అలాగే చాలా మంది విద్యార్థులు రోడ్డు దుస్థితి తో అవిడి హైస్కూల్ కు తరలి వెళ్లిపోతున్నారని వైస్ ఎంపిపి నేతల నాగరాజు ఎంఎల్ఎ దష్టి కి తీసుకువెళ్లగా ఎంఎల్ఎ స్పందించి రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు లేవ నెత్తిన సమస్యలను ఎంఎల్ఎ ఆయా శాఖ అధికా రులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు బూడిద వరలక్ష్మి, ఎంపిడిఒ జివి.సరోవర రావు, ఇఒపిఆర్‌డి బి.మమత, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ పి.నాగపద్మలక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమలాపురం

యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే విద్యాసదస్సుకు విజయవంతంచేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటివి. సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1974 ఆగస్టు 10న చారిత్రక అవసరంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఈ ఏడాది ఆగస్టు 10 నాటికి 50 ఏళ్లు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవాలను నిర్వహించుకుంటోదని వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 1 గంట నుండి విద్యాసదస్సు నిర్వహిస్తారని అన్నారు. ఈ సదస్సుకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పూర్వపు ఎంఎల్‌సి వి.బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర నాయకత్వం హాజరవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఈ విద్యా సదస్సును జయప్రదం చేయవలసినదిగా వారు కోరారు.

ఎరుకుల కుల ధృవీకరణ నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమలాపురం పట్టణంలోని ఎరుకుల, ఫేక్ ఎరుకుల కుల ధృవీకరణ అంశాలపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటైంది. వీరిలో అయిదుగురు రెవెన్యూ అధికారులను నియమించింది. రెవెన్యూ అధికారులు పట్టణ పరిధిలోని వారు నివాసించే ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో నిర్ధారణకై బుధవారం ఆర్ఐ బాలసరస్వతి, విఆర్ఒలు సుజాత, వీరబాబు, ఏలేశ్వరరావు, విప్పర్తి శ్రీనివాసరావులు ఇంటింటికీ వెళ్లి కుల నిర్ధారణ చేపట్టారు. వారి వెంట నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పు శ్రీనివాస్, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పలువురు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల సిఐ, ఎస్ఐలు బుధవారం బాధ్య తలు స్వీకరించారు.


అశోక్, రామచంద్రపురం సిఐ

రామచంద్రపురం సిఐ గా కడియాల అశోక్

రామచంద్రపురం: సిఐ గా కడియాల అశోక్ కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన పి.దొర రాజు బదిలీపై విఆర్‌కు వెళ్లారు. మచిలీపట్నంలో పనిచేస్తున్న అశోక్ బదిలీపై రామచంద్రపురం వచ్చారు. ఆయన వచ్చిన వెంటనే మంత్రి వాసంశెట్టి సుభాష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ద్రాక్షారామ ఎస్ఐగా ఎం .లక్ష్మణ్

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎం.లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా ఉండి పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ద్రాక్షారామ ఎస్ఐగా గా పనిచేసిన సురేంద్ర కొత్తపేట పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు.

రాజోలు ఎస్ఐగా బి.రాజేష్ కుమార్

రాజోలు: పోలీసుస్టేషన్ ఎస్ఐ గా బి.రాజేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది, పలువురు ప్రముఖులు రాజేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ... శాంతి భద్రతలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని, అందుకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నగరం ఎస్ఐగా ఎ.చైతన్య కుమార్

మామిడికుదురు: నగరం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎ.చైతన్య కుమార్ బుధవారం భాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి నగరం స్టేషన్ కి వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో మలికిపురం, అంబాజీపేట స్టేషన్ లలో పనిచేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తా న్నారు . స్టేషన్ సిబ్బంది,మండల మహిళా పోలీసులు, ఎస్ఐ చైతన్య కుమార్ కి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.


నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళా పోలీసులు

ఆలమూరు ఎస్ఐగా ఎం.అశోక్

ఆలమూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎం.అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నియోజకవర్గ కేంద్రం కొత్తపేట ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ప్రస్తుత ఎస్ఐగా ఎల్.శ్రీను నాయక్ అనపర్తికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎం.అశోక్‌కు స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-అంబాజీపేట


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అంబాజీపేట జెడ్‌పి పూర్వ విద్యార్థులు

అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు బుధవారం పాఠశాలలో కొత్తగా ప్రవేశ పెట్టిన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌కు సంబంధించి స్టూడెంట్స్‌కు స్టడీ మెటీరియల్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాల్లో వెలుగు నింపిన స్కూల్‌ను మార్చిపోలేమన్నారు. అన్నిదానాల్లో కన్నా విద్యాదానం గొప్పది కాబట్టి తాము చదువుకున్న పాఠశాల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు మెరుగైన విద్య ద్వారా తమలాగే ఉన్నత స్థానాలకు చేరాలని స్టడీమెటీరియల్స్, బుక్స్ అందజేశారు. తద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు. తమకు విద్య నేర్పిన పాఠశాలను జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను ఎప్పటికీ మరువలేమన్నారు.

హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలోని బాలికల జూనియర్ కళాశాల(హైస్కూల్ ప్లస్) విద్యార్థినిలకు బుధవారం ప్రధానోపాధ్యాయిని సిహెచ్.పరిమళ చేతులు మీదుగా విద్యార్థినిలకు పుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల(హైస్కూల్ ప్లస్) ప్రధానోపాధ్యాయిని సిహెచ్ పరిమళ విద్యార్థులనుద్దేసించి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు లక్ష్య సాధనకు చేరుకోవచ్చునని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. కమిని పంచాయతీ పరిధిలోని వలసల తిప్ప గ్రామానికి చెందిన వివాహిత భర్త నుంచి విడిపోయి పుట్టింటిలో ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ఎలిపే రామకృష్ణ గత కొంతకాలంగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని అంటూ మాయ మాటలు చెప్పి వెంట పడ్డాడు. గత నెలలో తన ఇంటి దాబాపై ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ విషయం తల్లిదండ్రులకు చెబితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో ఆమె ఈ విషయం ఎవరికీ చెప్పకుండా దాచి పెట్టింది. అయితే ఇటీవల అనారోగ్యంగా ఉండటంతో తల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఆమె గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడిని పెళ్లి చేసుకోమని పెద్దల్లో పంచాయతీ నిర్వహించగా రామకృష్ణ పెళ్లికి నిరాకరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సిఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం..

ప్రజాశక్తి - మామిడి కుదురు

పాశర్లపూడిలో రేషన్ బియ్యంను కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు బుధవారం సివిల్ సప్లై అధికారులు రెండు ప్రదేశాల్లో తనిఖీలు చేసి 4529 కేజీల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. తోట సుబ్బారావు కాంప్లెక్స్‌లో 1850 కేజీలు చౌక బియ్యం గుర్తించి కాంప్లెక్స్ యజమాని తోట సుబ్బారావు తోపాటు బియ్యం నిల్వ ఉంచిన బొరుసు మురళీకృష్ణ లపై కేసు నమోదు చేశారు. రామా ట్రేడర్స్ నందు 14 బస్తాలలో 2679 కేజీల రేషన్ బియ్యం గుర్తించి యజమాని తోట భవననారాయణపై కేసు నమోదు చేశామని రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెఎస్‌వివి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్నాథ రెడ్డి, వ్యవసాయాధికారి జయ భార్గవమహేష్, స్థానిక సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

60 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి శివారు ఏలేరు కాలువ వద్ద ఆటోలు తరలిస్తున్న 60 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆటోలో గంజాయిని తరలిస్తుండగా ఏలేరు కాలువ వద్ద కాపు కాసి ఆటోను తనిఖీ చేయగా దానిలో 60 కేజీల గంజాయిని గుర్తించామని తెలిపారు. గిడజం గ్రామానికి చెందిన తుంపాల సూర్యప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - రాజానగరం

వ్యాన్ టైరు గాలి తగ్గడంతో డ్రైవర్ టైర్ తీస్తుండగా అటుగా వస్తున్న లారీ వేగంగా ఢీ కొనడంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐషర్ వ్యాన్ టైర్ గాలి తగ్గడంతో జాతీయ రహదారి కొంతమూరు గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో వ్యాన్ ఆపి డ్రైవర్ ఈడే శివ శంకర్ (38) టైర్ విప్పాడు. ఈలోగా వైజాగ్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఆగి ఉన్న వ్యాన్ ఢీ కొట్టాడు. దీంతో డ్రైవర్ శివశంకర్‌ను ఈడ్చుకుంటూ రహదారి డివైడర్ దాటి అటువైపు వెళ్ళింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నూజివీడు సమీపంలో శోభనా పురానికి చెందిన వాడు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

రెండు కార్లు ఢీకొని ఆరుగురు గాయపడిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం సాయంత్రం నేషనల్ హైవేలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంకు చెందిన చిన్నాబత్తుల సురేష్ కుమార్ అతని భార్య, కుమారుడు, డ్రైవర్‌తో కలిసి అమలాపురం నుంచి కొయ్యలగూడెం వెళుతున్నారు. గోపాలపురంలో మరో కారులో ఒక యువకుడు మరొక ఇద్దరితో వస్తుండగా రెండు కార్లు గోపాలపురం శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు.

పిఠాపురం పెత్తనం 'పెండెం' కేనా...?

- వైసిపికి రాజీనామా చేసిన దొరబాబు
- జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం
- వర్మకు చెక్ పెట్టేందుకు జెఎస్‌పి వ్యూహం?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు రోజురోజుకూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇక్కడ రాజకీయ సమీకరణలు జోరుగా మారుతున్నాయి. తాజాగా వైసిపి పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు వైసిపికి రాజీనామా చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కూటమితో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. త్వరలోనే ఆయన జనసేన పార్టీ కండువా కప్పుకోనున్నారు. నియోజకవర్గ సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర వైసిపి నాయకులను తన వెంట తీసుకుని వెళ్లి జనసేనలో చేరనున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే తాను పార్టీ మార్పుపై రాజీనామా చేసేనని, పిఠాపురం ప్రజలు, కార్యకర్తలు, నాయకులను అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ సమన్వయం చేసుకుంటానని చెప్పారు. మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు త్వరలో తన అభిప్రాయం తెలియజేస్తానని కూడా వెల్లడించారు. ప్రజలు నియోజకవర్గ అభివృద్ధిని కోరుకుంటున్నందునే తాను పార్టీకి రాజీనామా చేసి కూటమి వైపు చూస్తున్నానని దొరబాబు స్పష్టం చేశారు. అంతే తప్ప ప్రలోభాలకు లొంగి, నియోజకవర్గంలో పెత్తనం చేయడం కోసం పార్టీ మారడం లేదని తెలిపారు.

పార్టీ పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం

వైసిపికి రాజీనామా చేసిన పెండెం జనసేనలో చేరడం దాదాపుగా ఖాయం అయినట్లు ఆయన అనుచరులు ఇప్పటికే ప్రచారం సాగిస్తున్నారు. ముహూర్తం కూడా ఫిక్స్ చేసే అవకాశం ఉందని, భారీగా వైసిపి శ్రేణులను సమీకరించి పవన్ సమక్షంలోనే కండువా కప్పుకుంటారని చెబుతున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టలేకపోతున్నారనే అసంతృప్తి జనసేనలో ఉంది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ నియోజకవర్గంకు చెందిన జనసేన సీనియర్ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అయితే స్థానికంగా జనసేనను పూర్తిస్థాయిలో నడిపించగల తగిన నాయకత్వం లేదనే వాదన ఉంది. నాయకులు ఎక్కువ మందే ఉన్నప్పటికీ వర్గ పోరుతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు ఉన్నాయి. అందు వలనే ఎన్నికలకు 8 నెలల ముందు స్థానిక నాయకత్వాన్ని కాదని ప్రస్తుత కాకినాడ ఎంపి ఉదయ్ శ్రీనివాస్‌ను పవన్ కళ్యాణ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అయితే అనూహ్యంగా పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేసి గెలుపొందారు. దీంతో ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను అనుకున్న స్థాయిలో సమన్వయం చేయలేకపోతున్నారనే విమర్శలు సొంత పార్టీ నేతల నుంచే వ్యక్తం అవుతోంది. సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నారనే అనుమానాలు అధిష్టానం కూడా వ్యక్తం చేస్తోంది. ఇటీవల ఎంఎల్‌సిగా ఎంపికైన పి.హరిప్రసాద్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలనుకున్నా స్థానికంగా అతనికి అంతగా పట్టులేదు. పైగా పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యవహారాల్లో ఆయన కీలకంగా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో హరిప్రసాద్ పిఠాపురంకు తగిన సమయం కేటాయించే అవకాశం లేదు. మరో వైపు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరిగినా కుటుంబ పెత్తనం అనే విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉంటుందని పవన్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 20 ఏళ్ల పైబడి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండడంతోపాటు, రెండు సార్లు పిఠాపురం ఎంఎల్‌ఎగా పనిచేసిన దొరబాబును పార్టీలోకి చేర్చుకుని ఆయనకు ఇన్‌ఛార్జ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. మరోవైపు ఇక్కడ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్న మాజీ ఎంఎల్‌ఎ వర్మ జనసేన పార్టీకి తలనొప్పిగా మారారు. ఇరు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితులు మారిపోయాయి. ఎటువంటి ప్రోటోకాల్ లేకుండానే వర్మ ప్రభుత్వ కార్యకలాపాల్లో తల దూర్చుతున్నారని జనసేన శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిణామాలతో వర్మకు చెక్ పెట్టేందుకు అధిష్టానం పెండెంకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది.



పిఠాపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు

దొరబాబు వస్తే లుకలుకలు తప్పవా..!

మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు జనసేన పార్టీలోకి చేరితే పాత, కొత్త జనసేన నేతలు మధ్య సమన్వయం తలెత్తే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాత, కొత్త నేతలు అంతా కలిసి ముందుకు సాగాలని పవన్ కళ్యాణ్ పిలుపునిస్తున్నారు. అయితే ఇది నియోజకవర్గంలో ఏమేరకు ఫలిస్తుందనేది అనుమానంగా కనిపిస్తోంది. ఇప్పుడు దొరబాబు చేరి ఒకవేళ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు గనుక చేపడితే ఒక వైపు టిడిపితోనూ, రెండోవైపు ఆరంభం నుంచి ఉన్న జనసేన శ్రేణులను సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. వెళ్లడం కత్తి మీద సాములా కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ ఆశలు, ఆశయాలకు తగ్గట్టుగా ఇక్కడ పని చేయాలంటే రెండు శిబిరాలు ఏ మేరకు సహకరిస్తాయి, వారిని కలుపుకుని ఏ విధంగా ముందుకు సాగుతారనేది ప్రశ్నార్థకంగా ఉంది. మొన్నటి వరకు ఎంఎల్‌ఎగా ఉన్న దొరబాబుపై నియోజకవర్గ వ్యాప్తంగా వర్గ సమస్యలు ఉన్నాయి. ఇప్పుడు సొంత వర్గంతోపాటు అతని వ్యక్తిగతంగా వ్యతిరేకించే వర్గం కూడా తయారయింది. ఈ నేపథ్యంలో పిఠాపురంలో రాజకీయాలను జనసేన ఏ విధంగా ప్రభావితం చేసే అవకాశం ఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

యానాం వార్తలు



గవర్నర్‌కు పూలగుచ్ఛాన్ని అందిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

నూతన లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నూతనంగా నియమితులైన కునియల్ కైలాసనాథన్‌ను బుధవారం రాజ్ నివాస్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగస్వామి, ఇతర మంత్రులు, ఎంఎల్‌ఎలు ఆయనను కలిసి సత్కరించారు. స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా రుణాలు మంజూరు చేయాలి..

ప్రజాశక్తి - యానాం

ఆదిద్రావిడ శాఖ ద్వారా గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న విద్యారుణాలు తక్షణమే మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. యానాం ప్రాంతానికి చెందిన పలువురు ఎస్‌సి విద్యార్థులు విద్యారుణాలకు దరఖాస్తు చేశారు. అయితే విద్యా సంవత్సరం గడిచినా ఆయా రుణాలు మంజూరు కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆయా రుణాలకు సంబంధించి రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉందన్నారు. అయితే గత ఏడాది దరఖాస్తు చేసిన రుణాలు నేటికీ మంజూరు కాలేదన్నారు. రుణాలు మంజూరుపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

ప్రజాశక్తి - కాకినాడ

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘాను పెట్టినట్లు ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డివిజన్ స్థాయి పిసి, పిఎన్‌డిటి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతోపాటు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన మొత్తం 111 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ఇందులో 11 ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉన్నాయన్నారు. ఏప్రిల్ నెల నుంచి జూలై నెల వరకు 2 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 106 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇన్‌ఛార్జ్ డిఐఒ డా.ఆర్.శ్రీనువాస నాయక్, రేడియాలజిస్టు జిజిహెచ్, డాక్టర్ న్యూరిష బేగం, కాకినాడ, పెద్దాపురం, తాళ్ళరేవు సిడిపిఒలు జి.ఉష, ఎ.జ్యోతి, డి.సుజాత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఇట్ల కిషోర్

లబ్ధిదారులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో బిఎల్‌సి హౌసింగ్ ప్రాజెక్టులో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేందుకు మెప్మా ఆర్‌పిలు లబ్ధిదారులకు అవగాహన పెంచాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బేస్‌మెంట్ వరకూ పనులు జరిగేందుకు ఎస్‌హెచ్‌జి, ఎస్-ఎల్‌ఎఫ్, టిఎల్‌ఎఫ్‌ల నుంచి ఇప్పటివరకు 636 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ 35 వేలు చొప్పున రుణ సదుపాయం అందజేశామన్నారు. మిగిలిన 1200 మంది లబ్ధిదారులకు అవగాహన పెంచాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఇఇ గుప్తా మాట్లాడుతూ 2025 ఏప్రిల్ వరకూ ఈ పథకం ఉందని, కావున పనులు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహనను పెంపుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఎఇ ప్రసాద్, మెప్మా సిఎంఎం భ్రమరాంబ, మెప్మా సిఒలు శ్రీదేవి, ఉమాపార్వతి పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక దుర్గామల్లేశ్వర ఆలయంలో ఈ నెల 16న శ్రావణ శుక్రవారం సందర్భంగా 2024 మంది ముత్తయిదువులతో వరలక్ష్మీ వ్రత పూజలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహకురాలు కనక విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత 55 సంవత్సరాలుగా తమ ఆలయంలో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో పండితులు అల్లక్కి రామం శాస్త్రి పర్యవేక్షణలో 2024 మంది ముత్తయిదువులతో ప్రత్యేక పూజలు చేపడతామని తెలిపారు. అలాగే 316 మంది ముత్తయిదువులకు డ్రా పద్ధతిన చీరలు అందించనున్నట్టు చెప్పారు. ఈ వరలక్ష్మి వ్రత పూజల్లో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిర్దేశించిన ధరలకే సరుకుల విక్రయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే సరుకులను విక్రయించాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మోహన్, డిసిపిసి మెంబర్ బి.సూర్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక రిలయన్స్ స్మార్ట్ పాయింట్ సూపర్ మార్కెట్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్కువ ధరలకు ఏర్పాటుచేసిన నిత్యవసర సరుకులు ఫైన్ సోనామసూరి, బిపిటి స్టీమ్ బియ్యం, పచ్చి ఫైన్ సోనామసూరి, దేశవాళీ రకం కందిపప్పును ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. అవసరమైన స్టాకు నిల్వ ఉండేలా చూడాలన్నారు. ధరల పట్టిక కొనుగోలుదారులకు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఈ ధరలు మూడు వారాల వ్యవధిలో రెండుసార్లు ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు.

ఘనంగా మరిడమ్మ సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బంగారమ్మ గుడి వీధిలో మరిడమ్మ సంబరం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సంబరంలో ప్రదర్శించిన గరగలు, కాళికా నృత్యాలు, సాము గారిడీలు, జానపద కళారూపాలు, విద్యుత్ దీపాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన పురాణ పాత్రల బండ్ల వేశాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బంగారమ్మ గుడి వీధి కమిటీ సభ్యులు సంబరాన్ని పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 9న ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండలంలో 33/11 కెవి. తాళ్లరేవు సబ్ స్టేషన్, చొల్లంగి సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కెవి. పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గాడిమొగ, బైరవపాలెం, పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు, చొల్లంగి, చొల్లంగిపేట, జి . వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవవల, సొంతమూల గ్రామంలకు విద్యుత్ సరఫరా కు అంతరాయము కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్. ఉదయభాస్కర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రత్నగిరీశా సత్యదేవా పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లిమిల్లి శేషారెడ్డి

ప్రముఖ కవి ర్యాలి ప్రసాద్ అన్నవరం సత్యదేవునిపై రచించిన రత్నగిరీశా సత్యదేవా వచన శతక పుస్తకాన్ని ఆదిత్య విశ్వవిద్యాలయ ఉపకులపతి, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం పర్వత శ్రేణుల మీద 130 ఏళ్ల క్రితం వెలసిన సత్యనారాయణ స్వామి మహిమాన్వితుడని, రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా అలరారుతున్న ఈ ఆలయ మూలవిరాట్టును గురించి ర్యాలి ప్రసాద్ రచించిన ఈ వచన శతకం భక్తి భావంతో నిండినదని పేర్కొన్నారు. కవి ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ వచనముల ప్రక్రియ ద్వారా రచించిన ఈ శతకం సామాన్య పాఠకులు కూడా చదువుకోవచ్చని అన్నారు.నల్లమిల్లి శేషారెడ్డికి ఒక టి.వి ఛానల్ వారు వివిధ రంగాల్లో సేవలందించిన వారికిచ్చే ప్రతిష్ఠాత్మక బిజినెస్ లీడర్ 2024 - అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడిశెట్టి భాస్కరరెడ్డి, కర్రి వెంకటేష్, కష్ణమోహన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

దూబగుంట రోశమ్మ 8వ వర్ధంతి

ప్రజాశక్తి - పిఠాపురం



రోశమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మండలంలోని భోగా పురంలో బుధవారం సారా వ్యతిరేక ఉద్యమ నాయకురాలు ధూబగుంట రోశమ్మ 8వ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు వేమగిరి తలుపులయ్య మాట్లాడుతూ యువత ఎక్కువగా మద్యం మాదక ద్రవ్యాలు సేవిస్తూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటు న్నారన్నారు. మద్యం మాదకద్రవ్యాల వల్ల అనేక కుటుంబాలు రోడ్డు పడడంతో వాటికి వ్యతిరేఖంగా రోశమ్మ సాహసం, పోరాట స్ఫూర్తి వెల కట్టలేనిదన్నారు. ఆమె స్ఫూర్తితో మద్యం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సోంబాబు, అబ్బాయి, సూరిబాబు, క్రాంతి కుమార్, జానుబాబు, సురేష్, ఆనంద్, రాజు, పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై నిరసన

ప్రజాశక్తి-అయినవిల్లి

ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై నిరసనగా, వర్గీకరణ పోరాటంలో నేలకొరిగిన స్వర్గీయ పివి.రావు, మాల మృత వీరులకు ఘన నివాళి అర్పించే 'మాల మత వీరుల సంస్మరణ సభ'కు విద్యార్థులు, యువకులు, సామాజికవాదులు, ఉద్యోగులు, న్యాయవాదులు, అంబేద్కరీయులు, ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాలు పాల్గొనాలని మాల మహానాడు నాయకులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ స్వర్గీయ పివి.రావు ఆశయ సాధనలో భాగంగా యువత 'మరో న్యాయ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మండలం మాల మహానాడు ఆధ్వర్యంలో ముక్తేశ్వరం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. మాల మహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకు గర్భిణులకు, చిన్నారులకు టీకాలు అందజేస్తున్నట్లు అంగర పిహెచ్‌సి ఎంపిహెచ్‌ఇఒ జె.మల్లికార్జునుడు తెలిపారు. బుధవారం పిహెచ్‌సి పరిధిలోని కపిలేశ్వరపురం -2 విలేజ్ హెల్త్ క్లినిక్ లో భాగమైన దేవి సెంటర్ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం -4 లో జరిగిన వ్యాధి నిరోధక టీకాల సెషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.